క్లుప్తంగా

విద్యా కానుక కిట్లు ప్రదర్శన



ఎమ్మార్సీలో ప్రదర్శించిన కిట్లు

సారవకోట: మండల కేంద్రంలోని ఎమ్మార్సీలో ప్రభుత్వం మంజూరు చేసిన జగనన్న విద్యా కానుక కిట్లును గురువారం ప్రదర్శించారు. ఇప్పటివరకు ఎమ్మార్సీకి చేరిన బ్యాగ్, నోట్ బుక్స్, యూనిఫారం, టెక్స్ట్‌బుక్స్ తదితర వస్తువులను ప్రదర్శనకు ఉంచారు. జగనన్న కిట్లుగా వచ్చిన సామగ్రిని వచ్చే నెల 5వ తేదీ నాటికి పాఠశాలలకు చేర్చనున్నట్లు ఎంఈఓ ఎం.వి.రమణ తెలిపారు.

లోకోస్ యాప్‌పై శిక్షణ పూర్తి



శిక్షణ ఇస్తున్న ఏపీఎం త్రినాథమ్మ, ధర్మారావు

కొత్తూరు: లోకోస్ యాప్‌లో ఆధార్ కార్డుతో అనుసంధానం చేసే విధానంపై మహిళా సంఘాల సీసీలు, వీఏలకు ఇస్తున్న శిక్షణ కార్యక్రమం గురువారంతో ముగిసింది. మూడు రోజులపాటు వెలుగు కార్యాలయంలో శిక్షణ కార్యక్రమాన్ని ఏపీఎం త్రినాథమ్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం జాతీయ స్థాయిలో మహిళా సంఘాల వివరాలు తెలుసుకునేందుకు లోకోస్ యాప్ ఉపయోగపడుతుందన్నారు. దేశంలో అన్ని రాష్ట్రాల్లోని మహిళా సంఘాలను అనుసంధానం చేసేందుకు శిక్షణ ఉపయోగపడుతుందన్నారు. శిక్షణ పొందిన సీసీలు, వీఏలు గ్రామాల్లో పర్యటించి సభ్యుల ఆధార్, బ్యాంకు రుణాలు, పొదుపుతోపాటు అన్ని ఆర్థిక పరమైన వివరాలు యాప్‌లో పారదర్శకంగా నమోదు చేయాలన్నారు.

ఇంగ్లిష్ వ్యాకరణంపై శిక్షణ



శిక్షణకు హాజరైన విద్యార్థులు

ఎల్.ఎన్.పేట: మండలంలోని డొంకలబడవంజ గ్రామంలో ఇంగ్లిష్ వ్యాకరణంపై శిక్షణ ఇస్తున్నట్లు ఠాగూర్ ఎడ్యుకేషనల్ అండ్ సర్వీస్ సొసైటీ అధ్యక్షుడు పెద్దకోట వెంకటరావు అన్నారు. వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా డొంకలబడవంజ గ్రామంలోని ప్రజా గ్రంథాలయం (బీడీసీ)లో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. పదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు ఇంగ్లిస్ భాషపై పట్టు సాధించేందుకు ఇస్తున్న శిక్షణ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రతీరోజు ఒక్కొక్క అంశంపై శిక్షణ ఉంటుందన్నారు. ఇంగ్లిష్‌తోపాటు మ్యాప్‌పాయింటింగ్, గణితం, కెరీయర్ గైడెన్స్ వంటి అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తామన్నారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

తాగునీటి సదుపాయం కల్పించాలని వినతి



ఏఓకు వినతిపత్రం అందజేస్తున్న గిరిజనులు

సారవకోట: మండలంలోని బద్రి పంచాయతీ మామిడిజోల గ్రామంలో తాగునీటి సదుపాయం కల్పించాలని, ఆ గ్రామానికి చెందిన గిరిజనులు మండల పరిషత్ ఏఓ ప్రసాదరావుకు గురువారం వినతిపత్రం అందించారు. తాగునీటి కోసం రెండు కిలో మీటర్లు వెళ్లావల్సి వస్తుందని, తాగునీటి సదుపాయం కల్పించాలని కోరారు. గిరిజన ఐక్యవేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి చౌదరి లక్ష్మీనారాయణ, మండల అధ్యక్షుడు జన్ని రామారావు పాల్గొన్నారు.

ఎమ్మార్సీకి చేరిన విద్యా కానుకలు



ఎమ్మార్సీలో భద్రపరిచిన పాఠ్యపుస్తకాలు

కొత్తూరు: మండలంలోని ఎమ్మార్సీకి జగనన్న విద్యా కానుక కిట్లు వచ్చాయని ఎంఈఓ బి.శ్రీధర్ గురువారం తెలిపారు. మండలానికి సుమారు 45 వేలు పుస్తకాలు అవసరం కాగా.. మొదటి విడతగా 20723 పాఠ్యపుస్తకాలు వచ్చాయన్నారు. ఎనిమిది, పదో తరగతులకు చెందిన అన్ని పాఠ్యపుస్తకాలు పూర్తిస్థాయిలో వచ్చినట్లు చెప్పారు. వేసవి సెలవులు నెల రోజు ముందర పాఠ్యపుస్తకాలను ప్రభుత్వం సరఫరా చేసింది. సెలవులు పూర్తికాకముందే అన్ని తరగతులకు చెందిన పాఠ్యపుస్తకాలు సరఫరా చేసేందుకు ప్రభుత్వం అన్ని చర్యలూ తీసుకున్నట్లు ఏఈఓ చెప్పారు.

సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శం



మాట్లాడుతున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

- దళ్లవలసలో సచివాలయ భవనాన్ని ప్రారంభించిన స్పీకర్ తమ్మినేని సీతారాం



సచివాలయాన్ని ప్రారంభిస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

పొందూరు: సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శమని, సచివాలయాల ద్వారా గ్రామాల్లో పాలన అందిస్తున్న ఏకైక ప్రభుత్వం మన రాష్ట్ర ప్రభుత్వమని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. దళ్లవలస గ్రామంలో రూ. 40 లక్షలతో నిర్మించిన సచివాలయ భవనాన్ని సర్పంచ్ కిల్లాన జ్యోతి, ఎంపీటీసీ కిల్లాన సూర్యారావు, అధికారులతో కలిసి గురువారం ప్రారంభించారు. సచివాలయ వ్యవస్థకు అనుసంధానంగా వలంటీర్ వ్యవస్థతో ప్రజల వద్దకే పాలన అందిస్తున్నామన్నారు. ఎన్ని పార్టీలు కలిసొచ్చినా, ఎన్ని కుట్రలు పన్నినా 2024లో మరళా వైఎస్సార్‌సీపీ ప్రభంజనం ఉంటుందని, సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి విజయకేతనం ఎగురవేస్తారన్నారు. జల్ జీవన్ మిషన్‌లో ద్వారా ఇంటింటికీ కుళాయిలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. కులం, మతం, పార్టీలను చూడకుండా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తుమన్నారు. వాహనమిత్ర, రైతు భరోసా, చేయూత, అమ్మఒడి, జగనన్న విద్యా దీవెన, వేకువజామునే పింఛన్‌లు ఇస్తున్నారనా ఇదేం ఖర్మ చేస్తున్నారని టీడీపీ నాయకులు ఇదేం ఖర్మ అని కార్యక్రమాలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. 2024లో టీడీపీ నాయకుల ఖర్మ పూర్తిగా కాలిపోతుందన్నారు. మాజీ ఎమ్మెల్యే కూన రవి కుమార్ స్వగ్రామం పెనుబర్తికి రోడ్డు వేయించామన్నారు. ఈ ప్రభుత్వం వేసిన రోడ్లు, నిర్మించిన భవనాల దగ్గర సెల్ఫీలు ఎందుకు తీస్తున్నారని ప్రశ్నించారు. మండలంలోని ఆక్రమించుకున్న భూముల దగ్గర, విశాఖలో కప్పరాం కొండకు వెళ్లి సెల్ఫీలు తీసుకోవాలన్నారు. పోలీసులను, అధికారులను తిట్టడం మానుకోవాలని హితవు పలికారు. ఉపాధి హామీ పథకం నిధులు సుమారు రూ.6 లక్షలతో పనులు పూర్తి చేసిన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని ప్రారంభించారు. జెడ్పీటీసీ లోలుగు కాంతారావు, పార్టీ మండల కన్వీనర్ పప్పల రమేష్‌కుమార్, నాయకులు తమ్మినైన కృష్ణ కుమారి, కొంచాడ రమణమూర్తి, బాడాన సునీల్, బాడాన కృష్ణ, గాడు నాగరాజు, సర్పంచ్ రేగిడి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రూ.10 లక్షలతో రహదారి అభివృద్ధి



రహదారి పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

- నిర్మాణ పనులకు భూమిపూజ చేసిన ఎమ్మెల్యే రెడ్డి శాంతి

పాతపట్నం: పాతపట్నం నీలమణిదుర్గ అమ్మవారి ఉత్సవాలు ఈ నెల 21 నుంచి 30 వరకు జరగనున్న నేపథ్యంలో ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా ప్రత్యామ్నాయంగా బూరగాం నుంచి పర్లాకిమిడికి రహదారి అభివృద్ధి (మరమ్మతులు) రూ.10 లక్షల ప్రత్యేక నిధులతో నిర్మాణ పనులు చేపట్టారు. గురువారం బూరగాం గ్రామ సమీపంలోని మహేంద్రతనయ నది వద్ద రహదారి పనులకు ఉత్సవ కమిటీతో కలిసి ఎమ్మెల్యే భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అమ్మవారి ఉత్సవాలకు పాతపట్నంలో ట్రాఫిక్ అంతరాయం లేకుండా ఉండడానికి బూరగాం వయా నీలకంఠేశ్వర ఆలయం మీదుగా పర్లాకిమిడి (ఒడిశా) రహదారికి మళ్లింపు చేయనున్నామన్నారు. కలెక్టర్‌తో ఎమ్మెల్యే మాట్లాడి రూ.10 లక్షల ప్రత్యేక నిధులు కేటాంచారని పీఆర్ డీఈఈ ఆర్.ఎస్.ప్రసాద్ తెలిపారు.

పీఆర్ జేఈ టి.ప్రసాద్, పీఏసీఎస్ అధ్యక్షుడు ఎం.శ్యామ్‌సుందరరావు, ఉత్సవ కమిటీ సభ్యులు ఎల్.వి.మధు, ఎల్.రవి కుమార్, కాళ్ల రాజు, నూలు బుజ్జి, ఎస్.ప్రదీప్, మల్లికార్జునరావు, ఎస్.మధు బాబు, జోగారావు, యరకయ్య, నూలు ఈశ్వర రావు, బాబూరావు, బూరగాం, కాగువాడ సర్పంచ్‌లు బిజిలి పుల్లాయ్, నల్లి రాజారావు, ప్రహల్లాద పుల్లాయ్, డి.పార్వతీశం, ఎం.తాతయ్య, వై.సూర్యం, ప్రభాకరరావు, పనుకు మోహన్, జి.అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

రైతులకు యంత్ర పరికరాల పంపిణీ



రైతు సంఘానికి యంత్ర పరికరాలను అందజేస్తున్న ఏడీ, తదితరులు

నరసన్నపేట: రైతు సంఘాలకు యంత్ర పరికరాలు సబ్సిడీపై ఇస్తున్నట్లు వ్యవసాయ శాఖ ఏడీ రవీంద్ర భారతి తెలిపారు. ప్రతీ ఆర్‌బీకేలో ఒక్కో రైతు సంఘానికి యంత్ర సహకారం 40 శాతం సబ్సిడీపై ఇస్తున్నామన్నారు. ఏడీ పరిధిలోని నాలుగు మండలాల్లో 91 ఆర్‌బీకేలు ఉండగా.. 52 ఆర్‌బీకేల్లో ఉన్న రైతు సంఘాలకు యంత్ర సహకారం అందించామన్నారు. ఈ సంవత్సరం మిగిలిన ఆర్‌బీకేల్లో ఉన్న సంఘాలకు యంత్ర పరికరాలు సబ్సిడీపై ఇస్తున్నట్లు తెలిపారు. మండలంలోని రావులవలసలో రైతు సంఘానికి ఇచ్చిన యంత్ర పరికరాలను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యంత్ర పరికరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వ్యవసాయాధికారి కె.సునీత, నరసన్నపేట డీసీసీబీ బ్రాంచ్ మేనేజర్ ఇప్పిలి సీతారాం, ఫీల్డ్ అసిస్టెంట్ అక్కయ్యరాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు బుల్లయ్య, ఎం.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నగదు పురస్కారానికి విద్యార్థిని ఎంపిక



రోజారమణి

సరుబుజ్జిలి: ఇటీవల ప్రకటించిన పదో తరగతి పరీక్ష ఫలితాల్లో రొట్టవలస జెడ్పీ హైస్కూల్ విద్యార్థిని గేదెల రోజారమణి 573 మార్కులతో మండల టాపర్‌గా నిలిచింది. ఆస్కార్ స్వచ్ఛంద సంస్థ వారు ప్రతిఏటా అందించే రూ.10 వేల పురస్కారానికి విద్యార్థినిని ఎంపిక చేసినట్లు సంస్థ ప్రతినిధి బొంగు సత్యనారాయణ గురువారం ప్రకటించారు. చదువుల్లో ప్రభుత్వం తీసుకువస్తున్న విప్లవాత్మక మార్పులు వల్లే మంచి ఫలితాలు వస్తున్నాయన్నారు.

నేడు కొత్తూరు పోలీస్ స్టేషన్ ప్రారంభం

కొత్తూరు: మండల కేంద్రం కొత్తూరులో రూ.2.50 కోట్లతో నిర్మించిన పోలీస్ స్టేషన్‌ను ఈ నెల 12న స్పీకర్ తమ్మినేని సీతారాం ప్రారంభించనున్నారు. ఈ మేరకు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సారిపల్లి ప్రసాదరావు గురువారం తెలిపారు. పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి కృషి మేరకు పోలీస్ స్టేషన్ నిర్మాణం జరిగిందన్నారు. ప్రారంభ కార్యక్రమం ఎమ్మెల్యే ఆధ్వర్యంలో జరుగుతుందన్నారు.

దరఖాస్తు చేసుకోవాలి

ఆమదావలస: ఆమదాలవలస ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ హెల్పర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐసీడీఎస్ పీఓ బాలామణి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆమదావలసలోని రావికండిపేట గ్రామానికి రోస్టర్ ప్రకారం అర్హత గల ఎస్సీ వివాహిత దరఖాస్తు చేసుకోవాలన్నారు. మండలంలోని వంజంగి-1 అంగన్వాడీ కేంద్రంలో అర్హత గల ఎస్టీ వివాహిత దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఈ నెల 12 నుంచి 19వ తేదీ లోగా దరఖాస్తులు చేసుకోవాలన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులు పీఓ కార్యాలయానికి అందజేయాలన్నారు. ఇంటర్వ్యూ తేదీ తరువాత ప్రకటిస్తామన్నారు.

55 మద్యం సీసాల స్వాధీనం

పాతపట్నం: పాతపట్నం మేజర్ పంచాయతీ పరిధిలోని రైల్వే స్టేషన్ గేటు వద్ద ఇద్దరు వ్యక్తుల నుంచి 55 మద్యం సీసాలను గురువారం స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ ఎన్.కామేశ్వరరావు తెలిపారు. ఒడిశా నుంచి ద్విచక్ర వాహనంపై మద్యం బాటిళ్లను తీసుకువస్తుండగా పట్టుకున్నామరు. మద్యం విలువ రూ.6,150 ఉంటుందన్నారు. ద్విచక్ర వాహనం సీజ్ చేసి, ఇద్దరిపై కేసు నమోదు చేశామన్నారు.

పది తప్పిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు



ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

నరసన్నపేట: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతూ ఇటీవల ప్రభుత్వం ప్రకటించిన పది ఫలితాల్లో తప్పిన విద్యార్థులందరూ పాసే లక్ష్యంగా ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారు. ప్రభుత్వం వేసవి సెలవులు ప్రకటించినా.. ఉపాధ్యాయులు పాఠశాలలకు వచ్చి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. మండలంలోని 12 ఉన్నత పాఠశాలల్లో 84 మంది విద్యార్థులు ఫెయిల్ అయ్యారు. వీరందరికీ ప్రత్యేక క్లాసులు తీసుకుంటున్నారు. గురువారం నరసన్నపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలతోపాటు సత్యవరం, ఉర్లాం, నరసన్నపేట బోర్డు ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయులు ప్రత్యేక తరగతులు నిర్వహించారు. సంప్లిమెంటరీ పరీక్షలకు విద్యార్థులను సిద్ధం చేస్తున్నామని ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎం వెంకటరావు అన్నారు. ఎంఈఓ శాంతరావు కూడా ప్రత్యేక తరగతులపై దృష్టి పెట్టారు. అవసరమైతే ఉపాధ్యాయులే విద్యార్థుల ఇళ్లకు వెళ్లి క్లాసులు తీసుకుంటున్నారని అన్నారు.

సమగ్ర భూ సర్వేతో ఆక్రమణలకు అడ్డుకట్టు



డ్రోన్ సర్వే నిర్వహిస్తున్న అధికారులు, గ్రామస్తులు

బూర్జ: మండలంలోని వైకుంఠపురం పంచాయతీలో తహసీల్దార్ ఎస్.రమణారావు ఆధ్వర్యంలో గురువారం సమగ్ర భూ సర్వేలో భాగంగా డ్రోన్ ద్వారా ఫొటోలు తీశారు. శాశ్వత భూ-హక్కు భూరక్ష పథకంలో భాగంగా రైతులతో గ్రామ సభ నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ భూ యజమాని హక్కు పత్రాలకు ఎటువంటి ఇబ్బంది తలెత్త కుండా సమగ్ర భూ సర్వే చేయడం జరుగుతుందన్నారు. భూ హక్కు పత్రాలు పొందాలంటే రైతులు తమ హక్కు పత్రాలు తెచ్చి సహకరించాలన్నారు. స్థానిక సర్పంచ్ బొడ్డేపల్లి వెంకటసత్యం మాట్లాడుతూ భూ సమస్యలు పరిష్కారానికి రీ సర్వే ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. సమగ్ర సర్వే టీమ్, ఆర్ ఎస్ డీటీ, మండల సర్వేయర్ గణపతిరావు, సచివాలయ సర్వేయర్ శంకరరావు, వీఆర్వోలు ఉమామహేశ్వరరావు, అప్పారావు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

బూర్జ: మండలంలోని ఒ.వి.పేట ఏ.పీ మోడల్ స్కూల్/కళాశాలలో 6వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతున్నట్లు ప్రిన్సిపాల్ బొడ్డేపల్లి శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో ఏదైనా గుర్తింపు పొందిన పాఠశాలలో 5వ తరగతి చదవాలి. ఓసీ, బీసీ కులస్తులు 2011 సెప్టెంబర్ ఒకటో తేదీ నుంచి 2013 ఆగస్టు 31వ తేదీ మధ్య పుట్టి ఉండాలి. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు 2009 సెప్టెంబర్ ఒకటో తేదీ నుంచి 2013 ఆగస్టు 31వ తేదీ మధ్య పుట్టి ఉండాలన్నారు. ఈ నెల నుంచి 25 వరకు ఏదైనా ఆన్‌లైన్‌లో అప్లయ్ చేయాలన్నారు. ప్రింట్ తీసిన కాపీలు విధిగా ఏపీ మోడల్ స్కూల్‌లో అందజేయాలన్నారు. 11 జూన్ ఉదయం 10 నుంచి 12 గంటల వరకు పరీక్ష ఉంటుందన్నారు. పూర్తి వివరాలకు ఫోన్ నంబర్‌ను 77994 93969 సంప్రదించాలన్నారు.

సీతారాంపల్లిలో ఫ్యామిలీ డాక్టర్



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యుడు శ్రీధర్

పాతపట్నం: మండలంలోని సీతారాంపల్లి గ్రామంలోని యూపీ పాఠశాల వద్ద బైదలాపురం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో గురువారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 120 మందికి వైద్యుడు ఐ.శ్రీధర్ వైద్య సేవలు అందించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. సుగర్, తదితరు దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారి ఇళ్లకు వెళ్లి వైద్య సేవలందించారు. గర్భిణులు, బాలింతల ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. ప్రతి నెలా ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లి ఆరోగ్యాన్ని చెక్ చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ధర్మాన కుమార్‌రెడ్డి, బాబూరావు, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు వైద్య సిబ్బంది, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని సహకరించారు.

300 మందికి వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ఆమదాలవలస రూరల్: గ్రామాల్లో నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాలను రోగులు సద్వినియోగం చేసుకోవాలని బెలమాం సర్పంచ్ కణుగుల కిశోర్ అన్నారు. బెలమాం గ్రామంలో మెడికవర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని గురువారం ప్రారంభించారు. 300 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. గ్రామ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం వల్ల సీజనల్ వ్యాధులకు దూరంగా ఉండవచ్చునని వైద్యులు సూచించారు. వేడి ఆహార పదార్థాలు, సురక్షితమైన తాగునీటిని నిత్యం తీసుకుని ఆరోగ్య సూత్రాలు పాటించాలన్నారు.

విద్యార్థులకు అభినందన



పాతపట్నం: మిట్టు మహాపాత్రోను అభినందిస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి



పోలాకి: విద్యార్థులను అభినందిస్తున్న మోడల్ స్కూల్ సిబ్బంది

పాతపట్నం: విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. పాతపట్నం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదివి పదో తరగతిలో 594 మార్కులు సాధించిన పాతపట్నం గ్రామానికి చెందిన మిట్టు మహాపాత్రోను ఎమ్మెల్యే అభినందంచారు. గురువారం మిట్టు ఇంటికి వెళ్లి తల్లిదండ్రులు దుర్గా ప్రసాద్ మహాపాత్రో, మమత మహాపాత్రోలను ఎమ్మెల్యే సత్కరించారు. అనంతరం రామరాజు టారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రామరాజు విద్యా పురస్కారం మిట్టుకు అందజేశారు. ఎంఈఓ సి.హెచ్.మణికుమార్, ఈఓపీఆర్డీ ప్రసాద్ పండా, వైస్ ఎంపీపీ ఎస్.ప్రదీప్, ఆలయ కమిటీ చైర్మన్ నూలు ఈశ్వరరావు, వైస్ సర్పంచ్ మమత, పార్టీ నాయకులు పనుకు మోహన్, సిర్ల ప్రభాకరరావు, టి.సుధాకర్, రామరాజు, భీమ్‌సెన్ పండా, షణ్ముఖరావు తదితరులు పాల్గొన్నారు.

ఈదులవలసలో..

పోలాకి: పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ చాటిన ఈదులవలస ప్రభుత్వ ఆదర్శ పాఠశాల విద్యార్థులకు ప్రిన్సిపాల్ ప్రవీణ ఆధ్వర్యంలోని అధ్యాపక బృందం, సిబ్బంది గురువారం అభినందనలు తెలిపారు. 584 మార్కులు సాధించిన గొలివి ప్రేమసఖితోపాటు 550 మార్కులు పైబడి సాధించిన కంచు స్పందన, శిమ్మస్వాతి, కై బాడ రోహిత్, జి.జాహ్నవి, పల్లి శరణ్య, డి.పల్లవి, పి.హారిక, సి.హెచ్.ఢిల్లీశ్వరి, ఎం.లాస్య, ముద్దాడ గాయిత్రి, బి.భార్గవి, జి.స్వామిచరణ్‌లను సత్కరించారు.

దరఖాస్తులు చేసుకోవాలి..

ఈదులవలస ఏపీ మోడల్‌స్కూల్‌లో 6వ తరగతి ప్రవేశ పరీక్షకు ఆసక్తి గల విద్యార్థులు ఈ నెల 25వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ పైడి ప్రవీణ తెలిపారు. ఎస్సీ, ఎస్టీలు రూ.75, ఓబీసీలు రూ.150 ఫీజు చెల్లించాల్సి ఉంటుందన్నారు. జూన్ 11న పాఠశాలలో ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఈకేవైసీ చేయించుకోవాలి

నరసన్నపేట: ప్రభుత్వ పింఛన్‌దారులందరూ ఈ నెల చివరిలోగా ఆధార్ కార్డుతో ఈకేవైసీ చేయించుకోవాలని నరసన్నపేట విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఎస్.ప్రభాకరరావు కోరారు. వాస్తవానికి ఈ నెల ఆరో తేదీతోనే సమయం అయిందన్నారు. అయితే చాలా మంది పింఛన్‌దారులు ఈకేవైసీ చేయించుకోనందున సంఘం తరపున విజ్ఞప్తి చేయగా ట్రెజరీ అధికారులు అంగీకరించారన్నారు. ఇప్పటికైనా పింఛన్ దారులు స్పందించి నెలాఖరులోగా ఈకేవైసీ విధిగా చేయించుకోవాలని కోరారు.

నేటినుంచి హనుమాన్ ఉత్సవాలు

ఆమదాలవలస రూరల్: మండలంలో కామిరెడ్డిపేట గ్రామంలో హనుమాన్ జయంతి ఉత్సవాలు శుక్రవారం నుంచి మూడు రోజులపాటు నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త కామిరెడ్డి నర్సింగరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మూడు రోజులపాటు పూజా కార్యక్రమాలతో సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందన్నారు. ఆదివారం ఆలయం ఆవరణలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. ఈ పూజా కార్యక్రమాల్లో భక్తులు పాల్గొనాలని కోరారు.